క్లుప్తంగా

విత్తనశుద్ధిపై అవగాహన



విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

సీతంపేట: అంతర్జాతీయ చిరుధాన్యాల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని పెదరామ, దేవనాపురం ఆర్‌బీకేలను మిల్లెట్ మిషన్‌కు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా రైతులకు రాయితీపై రాగి విత్తనాలు పంపిణీ చేశారు. విత్తనశుద్ధి, కాలిబాటల ఏర్పాటుపై అవగాహన కల్పించారు. వ్యవసాయశాఖ డివిజన్ సహాయ సంచాలకులు రత్నకుమారి, వ్యవసాయాధికారి తిలక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామదేవతకు పూజలు



పూజలో పాల్గొన్న భక్తులు

జియ్యమ్మవలస: మండలంలోని వెంకటరాజపురంలో నిర్మించిన గ్రామదేవత పేరంటాల గుడి ప్రతిష్ఠోత్సవం సోమవారం నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు పూజా కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించారు. మర్రాపు వెంకటనాయుడు, వినోద్, పద్మ, గుంపమ్మ గుడి నిర్మాణానికి ఆర్థిక సహకారం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలో అన్నసమారాధన చేశారు.

32 మంది ఉపాధ్యాయులకు సర్దుబాటు

వీరఘట్టం: మండలంలోని 62 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా వాటిలో 32 మంది ఉపాధ్యాయులను సర్దుబాటు చేసినట్లు ఎంఈఓ పర్రి కృష్ణమూర్తి సోమవారం తెలిపారు. ఇందులో 19 మందికి సాధారణ ప్రక్రియలో సర్దుబాటు చేయగా, 13 మంది ప్రమోషన్లతో ఇతర పాఠశాలలకు బదిలీ చేసినట్లు చెప్పారు. సర్దుబాటు చేసిన ఉపాధ్యాయులంతా వారికి కేటాయించిన పాఠశాలల్లో తక్షణమే విధుల్లో చేరాలని ఆదేశించారు.

ఏనుగుల నుంచి రక్షణ కల్పించండి

- సబ్‌కలెక్టర్‌కు మొరపెట్టుకున్న రైతులు



సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్‌కు సమస్యను వివరిస్తున్న రైతులు

భామిని: గత కొన్నేళ్లుగా ఏనుగుల కారణంగా పంటలు నష్టపోతున్నామని, గజరాజుల గుంపును ఈ ప్రాంతం నుంచి తరలించి తమకు రక్షణ కల్పించాలని రైతులు కోరుతున్నారు. ఈ మేరకు మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు మజ్జి మోహనబాబు, వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి కిల్లారి ఫాల్గుణరావు ఆధ్వర్యంలో తాలాడ, ఘనసర, కీసర, కోసలి తదితర గ్రామాలకు చెందిన రైతులు సోమవారం సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్‌ను కలిసి తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఏనుగులను తరలించనట్లయితే తమ గ్రామాల్లో క్రాప్ హాలీడే ప్రకటించాలని డిమాండ్ చేశారు. గత ఐదేళ్లలో నాలుగు పంచాయతీల పరిధిలో సుమారు 85 వ్యవసాయ పంపుసెట్లు, సోలార్ మోటార్లు, ఆయిల్ ఇంజిన్లు, పైపులను ఏనుగులు ధ్వంసం చేశాయన్నారు. 850 ఎకరాల్లో వరి, మొక్కజొన్న, చెరకు, అరటి, కూరగాయ పంటలను నాశనం చేశాయని వివరించారు. అలాగే తాలాడకు చెందిన రైతు గోపిశెట్టి చిన్నారావును గజరాజులు పొట్టన పెట్టుకున్నాయని విలపించారు. తక్షణమే బాధిత రైతులను ఆదుకోవాలని కోరారు. వారం రోజుల్లో పంటనష్ట ప్రాంతాలను పరిశీలిస్తామని, ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్తామని సబ్‌కలెక్టర్ హామీ ఇచ్చినట్లు రైతులు తెలిపారు.

యూడైస్ ఫారాలపై అవగాహన



మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసరావు

భామిని: మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈఓ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం హెచ్‌ఎంల సమావేశం నిర్వహించారు. యూడైస్ ప్లస్‌పై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఏన్యువల్ వర్క్ ప్లాన్, కన్‌సెటైంట్ రిథమ్, ఉపాధ్యాయుల లెసన్ ప్లాన్, టీచర్ డైరీపై సూచనలు చేశారు. వంట ఏజెన్సీలు మధ్యాహ్న భోజనం తయారీకి కట్టెల పొయ్యి కాకుండా గ్యాస్ స్టౌలను వినియోగించేలా చూడాలన్నారు. సమావేశంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, సీఆర్పీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, ఐఈఆర్టీలు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ప్రతీ ఇల్లు సుభిక్షం

- ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి



చంద్రశేఖరరాజపురంలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని, ఆయన మళ్లీ సీఎం అయితే ప్రతీ ఇల్లు సుభిక్షంగా ఉంటుందని ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని తాళ్లడుమ్మ పంచాయతీ లక్ష్మీపేట, రావాడ, దాసరిపేట, తాళ్లడుమ్మ, చంద్రశేఖరరాజపురం గ్రామాల్లో సోమవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. ఈ సందర్భంగా ప్రతీ గడపలో ఎమ్మెల్యేకు మహిళలు హారతులు పట్టారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో ఏ ప్రభుత్వమూ అందించనన్ని సంక్షేమ పథకాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందించి చూపించారన్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రతీ పేదవాడికి పథకాలు అందుతున్నాయని, అన్ని వర్గాల ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. ఇచ్చిన హామీల కన్నా అనేక రెట్లు సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత జగనన్న ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.

అడగకుండానే అన్నీ ఇచ్చారు..

గత ప్రభుత్వంలో పింఛన్ పొందాలంటే అధికారులు, జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి. జగనన్న అధికారంలోకి వచ్చిన తరువాత అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు, రేషన్‌కార్డులు, ఇంటి స్థలాలతో పాటు లక్షలాది రూపాయల విలువైన సంక్షేమ పథకాలను అందిస్తున్నారు. అడగకుండానే అన్నీ ఇస్తున్న జగనన్నకు ఓటుతో రుణం తీర్చుకుంటామని ప్రజలు ఎమ్మెల్యేతో చెపుతూ తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. జగనన్న లాంటి నాయకులు మరో 30 ఏళ్లపాటు అధికారంలో ఉంటే రాష్ట్రం అభివృద్ధి చెందడంతో పాటు ప్రతీ ఇల్లు సంక్షేమ పథకాలతో కళకళలాడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, ఏపీఎంఎస్‌ఎంఈ డైరెక్టర్ మూడడ్ల గౌరీశంకరరావు, జెడ్పీటీసీ శశికళ, మాజీ ఎంపీపీ గూనగంజి చంద్రయ్య, ఎంపీటీసీ రెడ్డి రవికుమార్, పార్టీ నాయకులు అల్లు ఈశ్వరరావు, బలగ వెంకటరమణ, మరడాన కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు దేవుకోనలో 'గడపగడపకు..'

కొమరాడ: మండలంలోని దేవుకోన గ్రామంలో మంగళవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎల్.వి.అప్పారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి పాల్గొనే ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది హాజరుకావాలని కోరారు.

ఆర్తులకు అండగా సీఎం సహాయనిధి

- ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: ముఖ్యమంత్రి సహాయనిధి ఆర్తులకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని తెట్టంగి గ్రామానికి చెందిన వండాన పావని అనారోగ్యం బాధపడుతుండడంతో ఆమె వైద్య ఖర్చుల కోసం ప్రభుత్వం సీఎం సహాయ నిధి నుంచి రూ.40 వేలు మంజూరు చేసింది. ఆ మొత్తాన్ని సోమవారం వండవ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కళావతి లబ్ధిదారు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎమ్మెల్యేతో పాటు పాలకొండ ఏఎంసీ వైస్ చైర్మన్ పొట్నూరు లక్ష్మణరావు ఉన్నారు.

నెలాఖరులోగా గృహ సారథుల నియామకం

భామిని: గ్రామ సచివాలయాల పరిధిలో గృహ సారథుల నియామక బాధ్యతలను సచివాలయ కన్వీనర్లు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ జేసీఎస్ మండల కోఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్ అన్నారు. మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 16 గ్రామ సచివాలయాల పరిధిలో నెలాఖరులోగా గృహ సారథుల నియామకం పూర్తి చేయాలని సూచించారు. వచ్చే నెల మొదటి వారంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి సమావేశం నిర్వహిస్తారన్నారు. సమావేశంలో భామిని సొసైటీ చైర్మన్ గెల్లంకి రమేష్, డైరెక్టర్ కె.కృష్ణారావు, బాలేరు సర్పంచ్ జామి ప్రభాకర్, పార్టీ నాయకులు మేడిబోయిన చలపతి, పిరపక కృష్ణారావు, మజ్జి జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ



గవరయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

పాలకొండ: పట్టణంలో 8వ వార్డు కౌన్సిలర్ తూముల కళావతి, ఆమె భర్త కూరాకుల కుల కార్పొరేషన్ డైరెక్టర్ తూముల లక్ష్మణరావులను ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సోమవారం పరామర్శించారు. కళావతి తండ్రి బొద్దాన గవరయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఈ మేరకు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఎమ్మెల్సీతో పాటు కౌన్సిలర్లు దుప్పాడ పాపినాయుడు, కొరికాన గంగునాయుడు, పల్లా భాను తదితరులున్నారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలు వినియోగించుకోండి



సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న డీఐఓ జగన్మోహనరావు

గరుగుబిల్లి: ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం ద్వారా అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐఓ) డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని కొంకడివరం గ్రామంలో డాక్టర్ ప్రియాంక ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. రోగులకు అందిస్తున్న వైద్యసేవలను పరిశీలించారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ అప్పలనాయుడు, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

హౌసింగ్ గొడౌన్‌గా పాత తహసీల్దార్ కార్యాలయం



పాత తహసీల్దార్ కార్యాలయ భవనం

వీరఘట్టం: మండలం కేంద్రంలో ఉన్న పాత తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని హౌసింగ్ గోదాంకు అప్పగించినట్లు డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్.సత్యనారాయణ తెలిపారు. గృహ నిర్మాణాలకు వచ్చే సిమెంట్‌ను నిల్వ చేసేందుకు గోదాం లేక పోవడంతో సమస్యలు ఎదుర్కొంటున్నామని హౌసింగ్ అధికారులు ఇటీవల జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఈ మేరకు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం రెవెన్యూ అధికారులు ఈ భవనాన్ని హౌసింగ్ అధికారులకు అప్పగించారు.

పురుషులకు పొదుపు రుణాలు

సాలూరు: పొదుపు సంఘాల్లో గల మహిళలకు బ్యాంకుల నుంచి రుణాలు మంజూరవడం సర్వసాధారణం. అయితే పట్టణంలో 50 ఏళ్ల లోపు గల పలువురు దినసరి వేతనదారులు పొదుపు సంఘంగా ఏర్పడ్డారు. దీంతో వారికి డీసీసీబీ బ్యాంక్‌లో మెప్మా ఆధ్వర్యంలో సోమవారం పొదుపు రుణాలు మంజూరు చేశారు. మగవారికి ఈ విధమైన పొదుపు రుణాలు మంజూరు చేయడం తొలిసారని బ్యాంక్ అధికారులు చెప్పారు. కార్యక్రమంలో బ్యాంక్ సీనియర్ మేనేజర్ సుందరరావు, సిబ్బంది పద్మ, తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా..



జావలిన్‌త్రోలో పతకం సాధించిన చిరంజీవిని అభినందిస్తున్న కళాశాల సిబ్బంది



పరుగు పోటీలో పతకం సాధించిన మనోహర్‌తో కోచ్ రామకృష్ణ

సీతంపేట: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పోటీల్లో సీతంపేట గిరిజన బాలుర గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థి సత్తా చాటాడు. ద్వితీయ సంవత్సరం విద్యార్థి వి.చిరంజీవి జావలెన్ త్రో క్రీడలో ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం సాధించాడు. విద్యార్థిని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ విశ్వనాథం, పీడీ లక్ష్మణమూర్తి, అధ్యాపకులు సోమవారం అభినందించారు.

పరుగులో రజతం

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీల్లో గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి బిడ్డిక మనోహర్ ప్రతిభ కనబరినట్లు కోచ్ బంగారి రామకృష్ణ సోమవారం తెలిపారు. ఈ నెల 22న శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో 400 మీటర్ల పరుగు పోటీలో మనోహర్ ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించాడు.

నేతాజీ యువతకు ఆదర్శం



సీతంపేట: నేతాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం లిల్లీరాణి, విద్యార్థులు



గుమ్మలక్ష్మీపురం: మూలిగూడ పాఠశాలలో నేతాజీ చిత్రపటం వద్ద విద్యార్థులు నివాళి



పాలకొండ: సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పాలకొండ: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవితం విద్యార్థులకు మార్గదర్శకమని వెంకమపేట ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం పంకుశంనాయుడు అన్నారు. నేతాజీ సుభాస్ చంద్రబోస్ జయంతి సందర్భంగా పాఠశాలలో సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలను కూడా లెక్కచేయకుండా పోరాడిన నేతాజీ ఆదర్శప్రాయుడని కొనియాడారు. మీరు నాకు రక్తాన్ని ఇవ్వండి నేను మీకు స్వాతంత్య్రం ఇస్తానని చెప్పిన నేతాజీ తన సివిల్ సర్వీస్ ఉద్యోగాన్ని తృణప్రాయంగా వదిలేశారని గుర్తుచేశారు.

ఆశ్రమ పాఠశాలలో..

సీతంపేట: స్థానిక గిరిజన బాలికల సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని నిర్వహించారు. హెచ్‌ఎం ఎ.లిల్లీరాణి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూఓ పాలక అమల పాల్గొన్నారు.

మూలిగూడ పాఠశాలలో..

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని మూలిగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, పాఠశాల హెచ్‌ఎం సామల సింహాచలం మాట్లాడుతూ.. చంద్రబోస్ గొప్ప పోరాట యోధుడని, దేశానికి స్వాతంత్య్రం తీసుకువచ్చేందుకు ఆజాద్ హింద్ ఫౌజ్‌ను ఏర్పాటు చేసి బ్రిటీష్‌వారితో పోరాటం చేశారని విద్యార్థులకు వివరించారు.

వైఎస్సార్‌సీపీతోనే సామాజిక న్యాయం సాధ్యం



లక్ష్మీకాంతం దంపతులను సన్మానిస్తున్న విశ్వబ్రాహ్మణుల సంఘం సభ్యులు

వీరఘట్టం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలోని అన్ని సామాజిక వర్గాలకు సమన్యాయం జరుగుతోందని విశ్వబ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ బూరాడ లక్ష్మీకాంతం అన్నారు. తన పదవీ కాలాన్ని పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. సోమవారం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన పంచవృత్తుల సేవా సంఘం సభ్యులతో కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఇటువంటి సంక్షేమ పాలన దేశంలో ఏ రాష్ట్రంలో లేదని, వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే వస్తుందని జోస్యం చెప్పారు. అనంతరం లక్ష్మీకాంతం దంపతులను పంచవృత్తుల సంక్షేమ సంఘం సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బూరాడ చిన్న, భోగి మణి, కెంగువ ఆంజనేయులు, విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ రామచంద్రరావు

జియ్యమ్మవలస: మండలంలోని తురకనాయుడువలసలో జరుగుతున్న ఉపాధి పనులను పీడీ కె.రామచంద్రరావు సోమవారం తనిఖీ చేశారు. మస్తర్లు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రెండు పూటలా పనులకు హాజరుకావాలని, రోజువారీ వేతనం రూ.257 తగ్గకుండా పనులు చేయాలని వేతనదారులకు సూచించారు. పనులను దగ్గరుండి పర్యవేక్షించాలని, పనులకు హాజరుకాని వారికి మస్తర్లు వేస్తే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. ఆయన వెంట ఈసీ తేజ, ఫీల్డ్‌అసిస్టెంట్లు ఉన్నారు.

మౌలిక వసతులు కల్పించాలని వినతి



ఎంపీపీకి వినతిపత్రం అందజేస్తున్న ఏగులవాడ పంచాయతీ పెద్దలు

కురుపాం: మండలంలోని ఏగులవాడ పంచాయతీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ ఎంపీపీ శెట్టి పద్మావతికి పంచాయతీకి చెందిన పలువురు సోమవారం వినతిపత్రం అందజేశారు. పంచాయతీలో రక్షిత మంచినీటి పథకం ట్యాంకులు, సీసీ రోడ్లు, కాలువలు మంజూరు చేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో వైస్ ఎంపీపీ రంగారావు, మాజీ ఎంపీపీ బొడ్డుదొర దమయంతి, భుజంగరావు, సుబ్బు, పాపారావు ఉన్నారు.

ఒడిశా గ్రామస్తులతో విబేధాలు పరిష్కరించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న గిరిజనులు

గుమ్మలక్ష్మీపురం: ఒడిశాకు చెందిన పల్లం తులసి గ్రామస్తులతో నెలకొన్న విబేధాలను పరిష్కరించాలని మండలంలోని కిత్తలాంబ, గుల్లలంక, వాడజంగి, ఇజ్జకాయి గ్రామస్తులు తహసీల్దార్ జె.రాములమ్మకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఆంధ్రా–ఒడిశా సరిహద్దులో ఉన్న పల్లం తులసి గ్రామం మీదుగా తమ గ్రామాలకు ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలను ఆ గ్రామస్తులు తొలగించారని, సరిహద్దులు చూపుతూ ఫారెస్ట్ అధికారులు వారితో మంతనాల కోసం ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. పల్లం తులసి గ్రామస్తుల చర్యల వల్ల ఆంధ్రాకు చెందిన మేమంతా అనేక సౌకర్యాలకు దూరమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లి పరిష్కారానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు.

శ్మశానవాటికకు హద్దులు నిర్ధారించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మంతినివలస గ్రామస్తులు

కురుపాం: శ్మశాన వాటికకు హద్దులు నిర్ధారించాలని కోరుతూ మంతినివలస గ్రామ గిరిజనులు తహసీల్దార్ ఆర్.రమేష్‌కుమార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. మేజర్ పంచాయతీ పరిధిలో ఉన్న శ్మశాన వాటిక సుదీర్ఘకాలం తమ ఆదీనంలో ఉందని, హద్దులు గుర్తించి తమకు స్వాధీనం చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మాజీ వైస్ ఎంపీపీ వంజరావు కృష్ణ, సర్సింహులు, సోములు, కురుపాం వైస్ సర్పంచ్ ఆదిల్, వైఎస్సార్‌సీపీ నాయకుడు శెట్టి నాగేశ్వరరావు, తదితరులు ఉన్నారు. దీనిపై తహసీల్దార్ సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు.

తూకంలో తేడాలు ఉంటే సహించేది లేదు



దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న మెట్రాలజీ అధికారులు

సీతంపేట: వినియోగదారులకు విక్రయిస్తున్న సరుకుల తూనికలు, కొలతల్లో వ్యత్యాసాలు ఉంటే సహించేది లేదని పలాస, పార్వతీపురం మన్యం లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్లు టి.శ్రీధర్, రత్నరాజు అన్నారు. సోమవారం సీతంపేట వారపు సంతలోని పలు దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. తూకం గుళ్లపై సకాలంలో ముద్రలు వేయించుకోకుండా అక్రమాలకు పాల్పడుతున్న 10 మంది వ్యాపారులపై కేసులు నమోదు చేశారు. సంతలోనే ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించి కాటాలు, తూకం గుళ్లపై సీల్స్ వేశారు. సీల్ లేని కాటాలు, తూకం గుళ్ల వినియోగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలి



వ్యాపారులతో సమావేశం నిర్వహిస్తున్న కమిషనర్

పాలకొండ: నగరపంచాయతీలో ప్లాస్టిక్ విక్రయాలను పూర్తిగా నిలిపివేయాలని కమిషనర్ సర్వేశ్వరరావు వ్యాపారులను కోరారు. పట్టణంలోని వ్యాపారులతో సోమవారం సమావేశమయ్యారు. 120 మైక్రాన్‌ల కంటే తక్కువగా ఉన్న ప్లాస్టిక్‌ను ప్రభుత్వం నిషేధించినందున వ్యాపారులు సహకరించాలని కోరారు. ఇక నుంచి ప్రతి రోజు తనిఖీలు చేపడతామని, ఎవరైనా నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తులు విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. షాపుల వద్ద ప్లాస్టిక్ కవర్లు అమ్మడం లేదని బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.

గిరిజన స్పందనకు 34 వినతులు

సీతంపేట: ఐటీడీఏలో సోమవారం జరిగిన గిరిజన స్పందనకు 34 వినతులు వచ్చాయి. ఏపీఓ వై.రోసిరెడ్డి వినతులు స్వీకరించారు. నిధుల దుర్వినియోగానికి పాల్పడిన హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని సవర బాణాపురానికి చెందిన ఎస్. రమణారావు ఫిర్యాదు చేశారు. సీతంపేట కేజీబీవీ పాఠశాలలో ఆయా పోస్టు ఇప్పించాలని పెదరామకు చెందిన పార్వతి కోరారు. వితంతు పింఛన్ మంజూరు చేయాలని సవర బరంతమ్మ, కుట్టుమిషన్ కావాలని బత్తిలికి చెందిన శైలజ, కొత్త రేషన్‌కార్డు మంజూరు చేయాలని పులిగుమ్మికి చెందిన దుర్గారావు దరఖాస్తు చేశారు. అలాగే వ్యవసాయ పైపులైన్ ఏర్పాటు చేయాలని కోసిమానుగూడకు చెందిన బుడ్డయ్య, పంచాయతీ బిల్డింగ్ మరమ్మతులు చేయించాలని పెద్ద సున్నాపురానికి చెందిన జయమ్మ కోరారు. ఎడ్యుకేషన్ ఓఎస్‌డీ యుగంధర్, గురుకులం సెల్ ఇన్‌చార్జ్ వెంకటేశ్వర్లు, ఏపీడీ నారాయణరావు, సీడీపీఓ రంగలక్ష్మి, పీఏఓ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న ఏపీఓ రోసిరెడ్డి